

ఐఎస్‌ఎఫ్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇండియన్స్ ఓట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18వ తేదీల్లో తిరుపతి శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కరాటే, బాడీ బిల్డింగ్, బ్యాడ్మింటన్ పోటీలను విజయవంతం కావడానికి కృషి చేసిన క్రీడా కోచ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఐఎస్ఎఫ్ అధ్యక్షులు జి. భార్గవ్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మూడు క్రీడా పోటీలకు దాదాపు 850 మంది క్రీడాకారులు హాజరయ్యారని అన్నారు. కరాటేకు 450 మంది పాల్గొన్నారని కోచ్ రత్నాకర్ తెలిపారు. కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో బాలురు నుండి అంకిరెడ్డి, బాలికల నుండి సత్యసాయి జిల్లాకు చెందిన సిరి మెడల్ సాధించారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నెల్లూరు జిల్లా ఐఎస్ఎఫ్ ఇన్‌చార్జి కుమార్, బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'జాన్సన్'పై ఎందుకంత ప్రేమ?

- లిఫ్ట్ టెండర్లో ఆ కంపెనీదే హవా
- అధికారులతో కుమ్మక్కే కారణమా..?

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

టిటిడి ఆధ్వర్యంలో జరిగే భారీభవంతుల నిర్మాణాలకు వినియోగించే లిఫ్టుల ఏర్పాటుకు దేవస్థానం గత మూడేళ్లుగా కేవలం జాన్సన్ కంపెనీ వైపే మొగ్గుచూపుతోంది. టెండర్ల ప్రక్రియలో కూడా అధికారులతో కుమ్మక్కు కావడంతో జాన్సన్ కంపెనీతో పాటు దానికి అనుబంధంగా ఉన్న మరో రెండు మూడు చిన్న కంపెనీలను ఆహ్వానిస్తారు. చివరకు జాన్సన్ కంపెనీకే టెండర్‌ను అందజేస్తారు. ఇతర కంపెనీలకు మూడేళ్లగా మొండి చేయ చూపడం గమనార్హం. ఆ కంపెనీపైనే ఎందుకంత ప్రేమో ఉన్నతాధికారులు వెల్లడించాల్సి ఉంది.

గత రెండు మూడేళ్ల కాలంలో టిటిడి అనుబంధ సంస్థలైన శ్రీవెంకటేశ్వర భక్తిచానల్ (ఎస్‌విబిసి) మెయిన్ బిల్డింగ్, బర్డు హాస్పిటల్, స్విమ్స్ ఆసుపత్రిలో బారీ భవంతలు నిర్మాణాలు చేశారు. ఇవి బహుళ అంతస్తుల బిల్డింగ్‌లు కనుక ఆయా ఫ్లోర్లకు వెళ్లేందుకు సులభ మార్గంగా లిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటు కోసం సాధారణంగా టిటిడి ఇంజనీరింగ్ అధికారులు బడ్జెట్‌ను అంచనా వేసి, ప్రాజెక్టు పేరుతో టెండర్లను ఆహ్వానిస్తారు. టెండర్లలో అర్హులైన వారు పాల్గొనవచ్చు. నాణ్యతలో రాజీ పడకుండా ఎవ్వరు తక్కువ కోట్ చేస్తే వారికి అధికారులు కేటాయించడం పరిపాటే. గత 15 సంవత్సరాలకు పైగా జాన్సన్ కంపెనీ ఈ టెండర్లలో పాల్గొని పనులు దక్కించుకుంటోంది. వీరితో పాటు ఇతర బహుళ కంపెనీలు కూడా టెండర్లలో పాల్గొని, కొన్ని పనులను దక్కించుకుని చేసేవారు. దీని వల్ల పారదర్శకత ఎక్కువగా ఉండేది. పోటీతత్వం ఉండడంతో టెండర్ కోట్ కూడా కంపెనీలు పోటీపడి వీలైనంత తక్కువ ధరలకు చేసేవారు. దీని వల్ల టిటిడికి కూడా ఆ ప్రాజెక్టుకు వేసుకున్న అంచనాలో కాస్త వ్యయం మిగిలేది. కానీ ఇటీవల కాలంలో గడిచిన మూడు సంవత్సరాల్లో అధికారులు కుమ్మక్కై కేవలం జాన్సన్ కంపెనీకు మాత్రమే టెండర్లను ఇస్తున్నారు. దేవస్థానం నిబంధనల మేరకు టెండర్ ప్రక్రియలో సింగిల్ బిడ్ వస్తే అది చెల్లుబాటు కాదు. రీటెండరు పిలవాల్సిందే. ఈ విషయంపై పూర్తి అవగాహన ఉన్న అధికారులు జాన్సన్ కంపెనీకి ముందే లీకులు ఇచ్చి, ఆ కంపెనీతో పాటు దానికి సహకరించే కొన్ని చిన్న కంపెనీలు (ఇప్పటి వరకు టిటిడి చరిత్రలో ఒక పని కూడా చేపట్టని కంపెనీలు) పేరుతో కొంత మంది టెండర్లలో పాల్గొనడం. బిడ్లు వేయడం, ముందుగా అనుకున్న పథకం ప్రకారం తాము వేసిన బిడ్డును జాన్సన్ కంపెనీకి తెలియజేయడం, వారు దానికన్నా తక్కువ ధరను కోట్ చేయడం. అధికారులు షరామామూలుగా ఈ కంపెనీకి పనులు అప్పగించడం జరిగిపోతోంది. ఇందులో మరో కిటుకు కూడా ఉంది. టెండర్ల ప్రక్రియ అనేది ఆన్‌లైన్ ద్వారా చేయాల్సింది. ముందుగా ప్రకటనలు ఇవ్వడం పరిపాటే. దీన్ని చూసి కొంత మంది ఔత్సాహికులు



టెండర్లలో పాల్గొనేందుకు ముందుకొస్తారు. అన్ని అర్హతలు ఉన్న కంపెనీలు టెండర్లలో పాల్గొనేందుకు వీలు లేకుండా అధికారులు తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తుండడం గమనార్హం. తిరుమల గోగర్భడ్యామ్ వద్ద ఆక్టోపస్ క్యాంపస్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. ఇందులో లిఫ్టులు ఏర్పాటు చేసేందుకు తాజాగా టిటిడి ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. 680 కేజీల (10 మంది కెపాసిటీ), 1088 కెజి (16 మంది కెపాసిటి)తో రెండు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించారు. దీనికి ఈ నెల 16న టెండర్లు పిలిచారు. 28వ తేది టెండర్లు లాస్టు డేట్, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తారు. ఈ టెండర్లలో పాల్గొనేందుకు అనేక కంపెనీలు ఆశక్తి చూపుతున్నాయి. కానీ జాన్సన్ కంపెనీపై అధిక ప్రేమ ఉన్న అధికారులు ఇతర కంపెనీలు ఇందులో పాల్గొననీయకుండా ఆన్‌లైన్‌లో వారి టెండర్లు అప్‌డేట్ కాకుండా, ముందుగానే ఎల్జిబుల్ లిస్ట్ (అర్హత)లో పేరును తొలగించేసి ఉండడంతో ఇతరులు పాల్గొనే అవకాశం లేకుండా ఉంది. ఇక్కడే అసల మతలబు నడుస్తోంది. ఇలాంటి వాటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, టిటిడి టెండర్ ప్రక్రియలు పారదర్శకంగా జరిగేలా చూసి, అటు నాణ్యమైన పరికరాల ఏర్పాటుకు, ఇటు టిటిడి ఆదాయానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

పుత్రశోకంలో ధర్మారెడ్డి

- టిటిడి ఈవో ఇంట విషాదం
- నేడు కర్నూలులో అంత్యక్రియలు
- హాజరుకానున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా పలువురి నివాళి

ఒక్కోసారి కుటుంబమంతా సంతోషంతో మునిగితేలుతూ ఉన్న సమయంలో ఊహించని ఉపద్రవం ముంచేస్తుంది. ఈవో ధర్మారెడ్డి ఏకైక కుమారుని పెళ్లి వేడుకల్లో సంతోషంగా ఉండగా ఆ ఇంట విషాదం నెలకొంది. గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన ఆయన కుమారుడు చంద్రమౌళిరెడ్డి (28) చెన్నయ్‌లోని కావేరి ఆస్పత్రిలో మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి బుధవారం తుదిశ్వాస విడిచారు. కర్నూలులోని సొంత గ్రామంలో జరగనున్న అంత్యక్రియలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హాజరు కానున్నట్లు సమాచారం. అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ, రాష్ట్ర వ్యాప్తంగానూ ఈవో ఎవి ధర్మారెడ్డిని ఫోన్‌లో పరామర్శించి, ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. పలువురు ప్రముఖులు చెన్నయ్‌కి, కర్నూలుకు వెళ్లి స్వయంగా నివాళి అర్పిస్తున్నారు.

ముంబాయిలో ఉద్యోగం చేస్తూ సివిల్స్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న చంద్రమౌళికి ఇటీవలే చెన్నయ్ పారిశ్రామికవేత్త, టిటిడి చెన్నయ్ స్థానిక సలహా మండలి అధ్యక్షులు ఎజె శేఖర్‌రెడ్డి కుమార్తెతో వివాహం నిశ్చయమయ్యింది. జనవరి 26వ తేదీన వీరి వివాహం తిరుమలలోని శృంగేరి మఠంలో జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే శుభలేఖలను ధర్మారెడ్డి దంపతులు హైదరాబాద్‌లో పంచుతుండగా, చెన్నయ్‌లో శుభలేఖలు ఇచ్చేందుకు చంద్రమౌళి కారులో వెళుతుండగా గుండెనొప్పి వచ్చింది. వెంటనే స్నేహితులు నగరంలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరేలోపే తీవ్ర గుండెపోటుకు గురైనట్లు గుర్తించిన డాక్టర్లు చంద్రమౌళిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి దంపతులు హుటాహుటిన చెన్నయ్ ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎక్మో ద్వారా చికిత్సను కొనసాగించారు. అయితే ఎంత ప్రయత్నం చేసినా చంద్రమౌళి ప్రాణాలను కాపాడలేకపోయారు. బుధవారం ఉదయం 8.20 గంటలకు మృతిచెందినట్లు కావేరి ఆస్పత్రి యాజమాన్యం ప్రకటించింది. గతంలోనే నేత్రదానం కోసం నమోదు చేసుకున్న నేపథ్యంలో ఈ సౌకర్యాన్ని కల్పించినట్లు వెల్లడించింది. ఏదిఏమైనా మరికొన్ని రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన కుమారుడు మరణించడంతో ధర్మారెడ్డి ఇంట, అటు వధువు కుటుంబంలోనూ విషాద ఛాయలు



ధర్మారెడ్డి కొడుకు చంద్రమౌళి (ఫైల్)

నెలకొన్నాయి. ధర్మారెడ్డికి కొడుకు చంద్రమౌళి, కుమార్తె ఉన్నారు. కుమార్తె వివాహమై విదేశాల్లో ఉంటున్నారు.

నేడు సొంత గ్రామంలోనే అంత్యక్రియలు, పలువురి నివాళి

చంద్రమౌళి పార్థివదేహాన్ని కర్నూలుకు తీసుకెళ్లి ధర్మారెడ్డి సొంత గ్రామమైన నందికొట్కూరులో అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం జరగనున్నాయి. కన్నబిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఇఓ ధర్మారెడ్డిని చెన్నై కావేరి ఆసుపత్రి వద్ద పలువురు పరామర్శించారు. సిపిఎం నేతలు కందారపు మురళి, నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ రావు, టిటిడి అటవీ కార్మికుల సంఘం నేతలు ఈశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, టీ మునికష్ణ, పి.కష్ణయ్య తదితరులు బుధవారం నాటి మధ్యాహ్నం పరామర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చెన్నయ్ నుంచి అమర ఆస్పత్రి సమీపానికి రాగానే శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి, టిటిడి అధికారులు, స్థానికులు పెద్దఎత్తున నివాళి అర్పించారు. ఉద్యోగులను చూసి ఈవో ధర్మారెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు.oo

తిరుపతి స్టేషన్ ఆధునీకరణ ముమ్మరం

యుద్ధప్రాతిపదికన 60 శాతం పనులు పూర్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుపతి రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు దాదాపు రూ.300 కోట్ల వ్యయంతో ముమ్మరంగా సాగుతు న్నాయి. ఈపిసి విధానంలో జరుగుతున్న ఈ పనులు ఫిబ్రవరి, 2025 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. రాబోయే 40 ఏళ్లకు అనుగుణంగా రైలు ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ స్టేషన్ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఇప్పటికే తిరుపతి రైల్వేస్టేషన్‌కు దక్షిణం వైపున పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో కొత్త స్టేషన్ భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పనుల్లో మొదటగా జియోలాజికల్ సర్వే పూర్తయిన తర్వాత క్యాంప్ ఆఫీస్, కాంక్రీట్ ల్యాబ్, స్టోరేజ్ షెడ్‌ల ఏర్పాటుకు సంబంధించిన పనులు ముందుకు సాగుతున్నాయి. భూగర్భ పార్కింగ్, ఇతర సౌకర్యాల ఏర్పాటుకోసం బేస్మెంట్ నిర్మించేందుకు భూమి తవ్వకం పనులు దాదాపు పూర్తయ్యాయి . కొత్తగా నిర్మించనున్న స్టేషన్ భవనానికి పునాదుల పనులు పూర్తి అయ్యాయి . బేస్‌మెంట్ ఫ్లోర్, గోడను సుమారు 5,600 కాంక్రీటుతో ఇప్పటి వరకు పూర్తి చేసారు . కొత్త అండర్‌గ్రౌండ్ పార్కింగ్ లో 2 వీలర్స్ , అలాగే 4 వీలర్ వెహికల్స్ రెండింటినీ కలిపి పార్క్ చేసే విదంగా సదుపాయం కలిగి ఉంది. దీంతో పాటు బేస్‌మెంట్ ఫ్లోర్ రిటైనింగ్ వాల్‌లో అరవైశాతం పూర్తయింది. ఇప్పటి వరకు, దాదాపు 1100 రీన్‌ఫోర్స్ మెంట్ స్టీల్‌ను ఫౌండేషన్, రిటైనింగ్ గోడలలో ఉపయోగించారు. బేస్ మెంట్ , ఫ్లోర్ స్లాబ్‌ను కాంక్రీట్ చేయడానికి సెంట్రింగ్ షట్టరింగ్‌కు సంబంధించి 20 శతం పనులు పూర్తయ్యాయి.

తిరుపతి స్టేషన్ పునరాభివద్ధికి సంబంధించిన ప్రతిపాదిత నమూనా ను తిరుపతి స్టేషన్ ప్రవేశద్వారం వద్ద సాధారణ ప్రజలకు ప్రదర్శన కోసం ఏర్పాటు చేశారు. ఈ మోడల్‌ను చూసేందుకు వచ్చిన ప్రజలు డిజైన్‌ను చూసి మెచ్చుకుంటున్నారు. బుధవారం అనగా తేదీ 21 డిసెంబర్ 2022న తిరుపతి పట్టణంలోని అక్కరంపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ ఉపాధ్యాయులు , పాఠశాల నిర్వాహకుల ఆధ్వర్యంలో విద్యా విహార యాత్రలో భాగంగా తిరుపతి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా, ప్రదర్శన కోసం సమర్పించిన తిరుపతి స్టేషన్ నమూనాను విద్యార్థులు తిలకించారు.



ప్రయాణికులకు అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తిరుపతి స్టేషన్‌ను అప్‌గ్రేడేషన్ పనులపై ప్రత్యేక దష్టి సారించామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రతి దశలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నమని తెలిపారు . నిర్మాణ సంస్థకు పూర్తి సహకారం అందించాలని రైల్వే అధి కారులను, సిబ్బందిని జనరల్ మేనేజర్ ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలను అరికట్టండి: సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: చిత్తూరు, ప్రకాశం నెల్లూరు జిల్లాలలో ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలలో అంతులేని అక్రమాలు జరిగాయని అధికార పార్టీ నాయకులు స్వయంగా పర్యవేక్షిస్తూ ఈ అక్రమాలకు తెరలేపారని సిపిఎం నేత కందారపు మురళి తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఎఎస్ అధికారి ప్రద్యుమ్న మంగళవారం మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించిన ఎన్నికల సమీక్షా సమావేశంలో అన్ని వైసిపి మినహా మిగిలిన రాజకీయ పార్టీలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నేత కందారపు మురళి, నగర కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యంలు ప్రసంగిస్తూ అర్హతలు లేని వారికి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలలో అనేక మందిని ఓటర్లుగా నమోదు చేశారని, రెండు వేల అభ్యంతరాలను కేంద్ర ఎన్నికల కమిషన్ కు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు నిర్దిష్టంగా తాము ఫిర్యాదులు సమర్పించామని వివరించారు. కొన్ని ఉదాహరణలను ప్రద్యుమ్న కు చదివి వినిపిస్తూ వినతి పత్రాన్ని అందించారు. సిపిఎం చేసిన సూచనను సీఈవో దష్టికి తీసుకు వెళ్తామని, అక్రమాలను సహించే పరిస్థితి లేదని, అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరిస్తామని ప్రద్యుమ్న వివరించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజీ, డిఆర్ఓ శ్రీనివాసరావు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ అనుపమ అంజలితో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధికారులు, సిపిఐ నేతలు కత్తి రవి, చలపతి, తెలుగుదేశం పార్టీ నేతలు నరసింహయాదవ్, మనోహరాచారి, రిపబ్లికన్ పార్టీ నేత పి.అంజయ్య, బీఎస్పీ నాయకులు శశికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహులు, బిజెపి నేత కె. వెంకటముని కార్యక్రమంలో పాల్గొన్నారు .



ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్నకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేత కందారపు మురళి



సుబ్రమణ్యం రెడ్డి అంత్యక్రియలు పూర్తి

నేడు చెవిరెడ్డి ఇంటికి సిఎం జగన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : చంద్రగిరి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి అంత్యక్రియలు బుధవారం ఉదయం ముగిసాయి. సుబ్రమణ్యంరెడ్డి భౌతిక కాయానికిలుప ముఖ్యమంత్రి నారాయణస్వామి, తిరుపతి ఎంఎల్ఎ బూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు చదలవాడ క్రిష్ణమూర్తి, సుగుణమ్మలు పూలమాల వేసి నివాళి అర్పించారు. తుమ్మలగుంటలోని ఇంటివద్ద నుంచి వైకుంఠ ధామం వరకూ చెవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి అంతిమయాత్ర సాగింది. తాత పార్థివదేహాన్ని మనవళ్లు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, ఆకాష్‌రెడ్డి, ధ్యానేష్‌రెడ్డి, చేతన్‌రెడ్డిలు అంతిమయాత్రలో మోశారు. నియోజకవర్గ ప్రజలు భారీగా తరలివచ్చారు. తండ్రి మృతదేహాన్ని చూస్తూ చెవిరెడ్డి కన్నీరుమున్నీరయ్యారు. చెవిరెడ్డిని సిఎం జగన్మోహన్‌రెడ్డి గురువారం పరామర్శించనున్నారురు.

అనంతబాబు దిష్టిబొమ్మ దగ్ధం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన స్మగ్లర్ ఎమ్మెల్సీ అనంత బాబు దిష్టిబొమ్మను ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అంబేద్కర్ విగ్రహం వద్ద దహనం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసి, శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐక్యవేదిక కన్వీనర్ పి.అంజయ్య, ఏపీ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు చందమామల కోటయ్య, ఇస్లాం నాయకులు బి.యస్.పి. నాయకులు విజయకుమార్, ప్రముఖ కవి, రచయిత గొడుగు జి.గోవిందయ్య ఎస్సీ ,ఎస్టీ ,ఉద్యోగ సంఘం నాయకులు డాక్టర్: ఎం .ప్రసాదరావు. మురళి ,రిపబ్లికన్ పార్టీ నాయకులు పి. నాగులయ్య ,పి.గురప్ప, ఏ. సుబ్రహ్మణ్యం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గిరి, బీసీ నాయకులు రుద్ర కోటి సదాశివం. అంబేద్కర్ ఆర్మీ చీఫ్ డాక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు

నీలిమ మృతిపై విచారణ జరపాలి

గూడూరు రూరల్ : గూడూరు ఏరియా ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి జనరేటర్ ద్వారా ఆక్సిజన్ అందక మంగళవారం డయాలసిస్ పేషంట్ మృతి చెందాడు. పేదల పట్ల ఆస్పత్రి నిర్లక్ష్య వైఖరిని తప్పుబడుతూ నెల్లూరు జనసేన జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. గూడూరు తూర్పువీధికి చెందిన నీలిమ మృతిపై విచారణ జరపాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఇంద్రవర్ధన్, ప్రధాన కార్యదర్శి వంశీ, సాయికిరణ్, ధనంజయ పాల్గొన్నారు.



కీర్తి రామినీడుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విభాగానికి చెందిన కీర్తి రామినీడుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం.దామ్లు నాయక్ ప్రకటనలో తెలిపారు. అదే విభాగానికి చెందిన సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం.బాలాజీ మార్గదర్శకత్వంలో "ఎవల్యూషన్ ఆఫ్ యాంటీ హైపర్ లిపెడమిక్ అండ్ యాంటీ హైపర్ గ్లైస్మిక్ యాక్టివిటీ ఆఫ్ నైజెల్ల సెటైవా" అనే అంశంపై పరిశోధనకు పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. కీర్తి రామినీడుకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.



మంత్రం తెచ్చిన తంటా

శ్రీకాళహస్తిలో తంత్ర వైద్యుడు దారుణ హత్య - పోలీసుల అదుపులో అనుమానితుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మంత్రం తెచ్చిన తంటా ఓ వ్యక్తి నిండు ప్రాణాల్ని బలి తీసుకుంది. మంత్రం ఫలించలేదన్న కారణంగా చంద్రగిరి చంద్రయ్య ఆచారి (56) అనే తంత్ర వైద్యుని బుధవారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు గొంతుకోసి అతికిరాతకంగా హతమార్చారు. ఈ ఘటన శ్రీకాళహస్తిలో సంచలనం కలిగించింది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు. పట్టణంలోని కైలాసగిరి కాలనీకి చెందిన చంద్రగిరి చంద్రయ్య ఆచారికి భార్య నిర్మల, కూతురు నీలావతి, కుమారుడు రుద్ర ఉన్నారు. పిల్లలకు ఇద్దరికి వివాహమైంది. కుమార్తె నీలావతి తన భర్తతో కలసి కైలాసగిరి కాలనీలో నివాసం ఉంటోంది. చంద్రయ్య ఆచారి ఆరోగ్యం బాగా లేని వారికి మంత్రించడం, తంత్రాలు వేయడం చేస్తుండేవాడు. అదేవిధంగా జ్యోతిష్యం చెప్పేవాడు. ఈయన పల్లెలకు కూడా వెళ్లేవాడు. తన వద్దకు వచ్చే వారికి మంత్రించడం, తంత్రాలు వేయడం, జ్యోతిష్యం చెప్పడం కోసం ఈయన కైలాసగిరి కాలనీ సమీపంలోని ఉపాధ్యాయనగర్ వద్ద ఒక గది నిర్మించుకున్నాడు. కొంతకాలం కిందట ఉపాధ్యాయనగర్ వద్ద బోర్డు కూడా ఈయన ఏర్పాటు చేశాడు. చంద్రయ్య ఆచారి వద్దకు పలువురు వచ్చి మంత్రించుకోవడం, తంత్రాలు వేయించుకోవడం, జ్యోతిష్యం చెప్పించుకోవడం చేసే వారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం10:30 గంటకు ఉపాధ్యాయ నగర్ లోని పూజ గదిలోనే ఆయన్ను పట్టపగలే గొంతుకోసి దారుణంగా హత్య చేయడం చర్చనీయాంశంగా మారింది. వైద్యం కోసం వచ్చినవారే ఇలా చేసి ఉండవచ్చన్న అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నాయుడుపేట సమీపంలోని పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన నాగార్జునరెడ్డిని అనుమతుడిగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నాగార్జున రెడ్డి దంపతులకు సంతానం కోసం మూడేళ్లుగా శ్రీకాళహస్తిలోని చంద్రయ్య ఆచారి వద్దకు తిరుగుతున్నారనీ, అయినా వారికి సంతానం కలగకపోవడంతో ఈ పనికి పాల్పడ్డాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



8న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీగాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య సూళ్లూరుపేట వారి సహకారంతో జనవరి 8వ తేదీన మూడవ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నాయకులు కొత్తపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా విస్తరించే కొద్దీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారికి అణువుగా ఈ వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 25వ తేదీ ఆదివారం వరకు నమోదు చేసుకున్న వారి వివరాలు మాత్రమే పుస్తకంలో ప్రచురించ బడతాయని ఆ తరువాత స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా పది రోజులలో ఎవరైతే రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. వారి వాట్సాప్ నెంబర్లకు పిడిఎఫ్ పంపుతామన్నారు. మరిన్ని వివరాలకు ఏపీ బిఎస్-ఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఓవి రామశర్మ 9490181898 సెల్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు భీమాస్ బాలాజీ, వాసుదేవరావు, శివకుమార్, జగన్నాధరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో రోజంతా 'నిషా'

బహిరంగంగానే అర్ధరాత్రి వరకూ అమ్మకాలు

ప్రజాశక్తి - నాయుడుపేట

'డబ్బుండాలే గానీ నాయుడుపేటలో మందుకు కొదవ లేదు' అంటున్నారు నాయుడు పేట లోని మందుబాబులు. అర్ధరాత్రే కాదు రోజంతా ఎప్పుడైనా సరే మందుబాబులకు ఇబ్బంది రాకుండా ఎక్సైజ్ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అక్కడ సమయంతో పని ఉండదు.. సిబ్బంది 24 గంటలూ షిఫ్ట్‌ల వారీగా పనిచేస్తారు. ఈ 'బార్' నాయుడుపేట అంటే కోర్టు, డిఎస్‌పి కార్యాలయానికి కూతవేటు దూరంలోనే.. అంటే న్యాయం, ధర్మం సమపాళ్లలో ఉండేచోటనే.. సమయంతో పని లేకుండా, నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నా వీరికి పట్టదు. ఉదయం ఏడు గంటల నుంచి తెల్లవారుజామున మూడు గంటల వరకూ అమ్మకాలు జరుగుతూనే ఉంటాయి. 'నిషా' మత్తులో మందుబాబులు ఉంటే, పోలీసు అధికారులు ఏ 'నిషా'లో ఉన్నారో అర్థం కావడం లేదని బహిరంగంగానే స్థానికులు నవ్వుకునే పరిస్థితి. మందుబాబులు మద్యం బహిరంగ ప్రదేశాల్లో సేవించుకుంటూ చిన్న చిన్న కూల్‌డ్రింక్ షాపులపై, డాబా హోటళ్ల వద్ద అపుడపుడు తనిఖీలు చేసే అధికారులకు ఇంత పెద్ద 'బార్' కనిపించడం లేదా? అని విమర్శిస్తున్నారు. ఈ బార్ వెనక 'అధికార పార్టీ' కీలక పాత్ర వల్లనే ఎవరూ ఏమి చేయలేని పరిస్థితన్నది వాస్తవం. బార్ నిర్వహణకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ బార్ నిర్వహించాలి. కానీ వీరు ఉదయం ఏడు గంటల నుంచి అమ్మకాలు మొదలు పెడతారు. తెల్లవారుజామున మూడు గంటలకు మూసేస్తారు. బార్‌కు సమీపంలనే ఆర్టీసీ బస్టాండ్ ఉండడంతో మహిళా ప్రయాణికులు ఇబ్బంఇ పడే పరిస్థితి. అర్ధరాత్రి అమ్మకాల వల్ల మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ప్రజాసంఘాల నాయకులు ఘాటుగానే విమర్శిస్తున్నారు. అయినా అధికార యంత్రాంగానికి పట్టదాయే.



విద్యావైద్యానికి అత్యధిక ప్రాధాన్యత

జిల్లాస్థాయి ట్యాబ్ల పంపిణీలో కలెక్టర్ వెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి -సత్యవేడు: దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా వైద్యంపై ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి చెప్పారు. బుధవారం సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన విద్యార్థు లకు ట్యాబ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి, జెడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మంజుల రమేష్, పుస్తకాల రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రనాథ్, జిల్లా విద్యాశాఖ అధి కారి శేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి విద్యార్థులను ద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న ట్యాబులను సద్వినియోగం చేసుకొని విద్యాసామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ మాట్లాడుతూ సాధారణ బోధన పద్ధతితో పాటు ఆన్లైన్ తరగతులు కూడా నిర్వహించాలని ఉద్దేశంతో ట్యాబ్లను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో బాలగణేషన్, ఎంఈఓ రవి, ఫారెస్ట్ రేంజర్ జై ప్రసాద్‌రావు, సీఐ శివ కుమార్ రెడ్డి, ఎస్ఐలు పురుషోత్తం రెడ్డి, వీరాంజనేయులు, వైయస్సార్ క్రాంతి పదం ఏపీఎం స్వర్ణలత, వైసీపీ జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు బీరేంద్ర వర్మ, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ బాలాజీ రెడ్డి, సురుటుపల్లి ఆలయ మాజీ ఛైర్మన్ మునిశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం గురుప్రసాద్, ఎంపిటిసి బాలయ్య, మండల వ్యవసాయ సలహా సంగం ఛైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, సర్పంచులు గోవింద్ స్వామి, రూబెన్, జయ, శేఖర్, జయ, మధురాజు, వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్భాటంగా సిఎం పుట్టినరోజు వేడుక

పేదలకు అన్నదానం, రక్తదానం, కేక్ కటింగ్‌లు



పీసీరాయల్ ఆధ్వర్యంలో భోజనం పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకుని బుధవారం జిల్లావ్యాప్తంగా పేదలకు అన్నదానం, రక్తదానం, కేక్ కట్‌చేయడం వంటి కార్యక్రమాల్లో వైసీపీ శ్రేణులు మునిగిపోయాయి. తిరుపతి గాంధీరోడ్డులోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం సేవా ట్రస్టు, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఛైర్మన్ డాక్టర్ పి.సి రాయులు అధ్యక్షతన సిఎం పుట్టినరోజు వేడుక జరిగింది. కేక్ కట్‌చ ఏసి, 300 మంది పేదలకు అన్నదానం చేశారు. బండి మధుసూదన్‌రెడ్డి, గాదె సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు. సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి రక్తదాన శిబిరానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి, జెడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ జల కార్మిక సంఘం అధ్యక్షులు బిరేంద్ర వర్మ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాలాజీ రెడ్డి, బెల్ట్ రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దాదాపు 20 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. **ఓజిలిలోని** మండల కేంద్రంలో ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి, జెడ్పిటిసి సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు, సర్పంచి గోవిందయ్య, దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఉచ్చురు హరినాధ్ రెడ్డి, కో- ఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాషా, ముమ్మడి సుబ్బారావు, బట్ట అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని పెద్దపరియ గ్రామంలో జగనన్న కాలనీ గృహప్రవేశాలను ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి, జెడ్పిటిసి సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు, సర్పంచి గోవింద సుధా, తహశీల్దార్ డీ.లాజరస్, ఎంపీడీవో రజనీకాంత్, హౌసింగ్ ఏఈ శివప్రతాప్ ఆధ్వర్యంలో పూర్తయిన 17 జగనన్న గృహప్రవేశాలను బుధవారం ప్రారంభించారు. నాయుడుపేటలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే టీటీడీ పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నాయుడుపేట డిఎస్ఆర్ కల్యాణ మండపంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపికా ఆధ్వర్యంలో రెండువందల మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. **గూడూరు రూరల్** పట్టణంలో గూడూరు శాసనసభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ మేరీగ మురళీధర్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గూడూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ముఖ్యమంత్రి అభిమానులు, కార్యకర్తలు మెగా రక్తదానం చేశారు. గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్‌లో జగనన్న జన్మదిన వారోత్సవాలలో భాగంగా డ్వాక్రా మహిళలకు పలు రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం దివ్యాంగులకు, రెడ్ సంస్థ సభ్యులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పొనక దేవసేనమ్మ దాతృత్వంతో చెక్కులను పంపిణీ చేశారు. చిల్లకూరు మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పిటిసి మన్యం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. వెలుగు



శ్రీకాళహస్తిలో..

కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి ఏపీఎం గున్నయ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. తిరుపతి(మంగళం)లోని తిరుపతి-కరకంబాడి మార్గం లోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో స్విమ్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సహకారంతో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర రావు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 120 యూనిట్ల రక్తాన్ని రక్తదానం ద్వారా అందించారు. **శ్రీరామ కళాశాలలో......** తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం, తిరుపతి రుయా ఆసుపత్రి సౌజన్యంతో జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 80 యూనిట్ల రక్తాన్ని రుయా బ్లడ్ బ్యాంకుకు అందించారు. గూడూరు పట్టణంలోని శ్రీపొట్టి శ్రీరాములు పార్క్‌లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావు చేపట్టారు. దొరవారిసత్రం మండల కేంద్రంలో సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే టీటీడీ బోర్డు





శంకర్ శాలిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో, 46వ వార్డులోని వార్డ్ కార్పొరేటర్ పెంచలయ్య ఆధ్వర్యంలో

సభ్యులు కిలివేటి సంజీవయ్య వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. ఎమ్మెల్యే కేకును కట్ చేసి దొరవారిసత్రం మండల ఉపాధ్యక్షులు వైసిపి సీనియర్ నాయకుడు దువ్వూరు గోపాల్ రెడ్డికి కేకును తినిపించారు. బాలాయపల్లి మండల కేంద్రంలో జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూజలు చేశారు. రేణిగుంట పట్టణంలోని సచివాలయంలో రక్తదాన ట్రస్ట్ చైర్మన్ కొరటూరు బాల ఆధ్వర్యంలో సుమారు 50 మంది పంచాయతీ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. తొట్టంబేడు మండల వైసిపి యువనేత కలపగుంట భరత్ రెడ్డి ఆధ్వర్యంలో కసరం, రాంబట్లపల్లి, పాతూర లలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు కాపీరైట్ పుస్తకాలను, గొట్టిపూడి గిరిజన కాలనీలో దుప్పట్లను పంపిణీ చేశారు. రేణిగుంట పట్టణంలోని బస్టాండ్ సమీపంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు కరుణ రెడ్డి ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పిటిసి సంధ్య సుజాత, పట్టణాధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో సుమారు 300 మందికి అన్నదానం చేశారు. **తిరుపతి సిటీ:** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు స్వెటర్లు పంపిణీ చేశారు. స్థానిక ఆంజనేయపురం వద్ద ఉన్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల వసతి గృహంలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కోరుముట్ల శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. తిరుపతి నగరంలో ఘనంగా నిర్వహించారు పలు ప్రధాన కూడలిలో ఆసుపత్రి ప్రాంగణాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. **బొమ్మగుంట రవి ఆధ్వర్యంలో..** వైయస్సార్ వీరాభిమాని వైసీపీ సీనియర్ నాయకుడు బొమ్మగుంట రవి ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలను స్థానిక రామచంద్ర పుష్కరిణి ఎదుట బొమ్మగుంటలో ఘనంగా నిర్వహించారు. 90 కేజీల స్వీట్ ను వార్డుల్లో ఇంటింటికి పంచారు పేదలకు చికెన్ బిర్యానీని పంచిపెట్టారు. వైయస్సార్ ప్రజాప్రస్థానం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ రోడ్‌లో సుమారు 500 మందికి నిర్వహించారు. ఎస్వీ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు మల్లార్పు మధు ఆధ్వర్యంలో స్థానిక రుయా ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి టిటిడి పాలకమండలి సభ్యుడు పోకల అశోక్ కుమార్ హాజరై కేక్ కట్ చేసి సుమారు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. శంకర శాలిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అలిపిరి లింక్ బస్టాండ్ వద్ద రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు ఒడితా శంకర్ నాయక్ సుమారు వెయ్యి మందికి రుచికరమైన ఆహారాన్ని పంపిణీ చేశారు. మల్లార్పు మధు, కుసుమ కుమారి, తేజ నాయక్ భాస్కర్ నాయక్, రాజు నాయక్ పాల్గొన్నారు. **46వ వార్డులో..** ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను 46వ వార్డులో వార్డ్ కార్పొరేటర్ పెంచలయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అక్షయ క్షేత్రం అనాధ శరణాలయంలో పిల్లలకు అన్నదానం నిర్వహించారు. వైసీపీ నాయకులు కార్యకర్తలు ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు. క్యాంపస్‌లో ఎస్ఎస్‌హెచ్ ఆర్ట్ విద్యాసంస్థల అధినేత చక్రవర్తి రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డాక్టర్ బి. ఓబుల్ రెడ్డి, లెక్కల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పదిహేను భవనం ఎదుట కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి స్వీట్లు పంచుకొని ఘనంగా నిర్వహించారు. శ్రీకాళహస్తిలో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ విగ్రహం వద్ద భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పెద్ద ఎత్తున పేదలకు అన్న దానం చేశారు. అనంతరం పట్టణానికి చెందిన 300 మంది ఆటో కార్మికులకు వైసిపి కండువాలు కప్పు కున్నారు. తమ ఆదేశించిన వైసీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మిద్దెల హరి ఆధ్వర్యంలో అక్షయ క్షేత్రంలోని మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. పుత్తూరు పట్టణంలోని స్థానిక బజారు వీధిలో వైసిపి పట్టణ కార్యదర్శి ఏలుమల్లై ఆధ్వర్యంలో కేకును కట్ చేసి ఆనందంగా పంచుకున్నారు. వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెళ్లకూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్‌డి సినిబి చైర్మన్ కామిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ చెంచు రెడ్డి, జెడ్పిటిసి నిత్య ప్రియ, సోమశేఖర్ రెడ్డి కేకును కట్ చేశారు. వాకాడులోని ఏఎంసీ కార్యాలయం ఆవరణంలో కొడవలూరు దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీలు, సర్పంచులు, వైకాపా నాయకులు, కార్యకర్తల సమక్షంలో వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి భారీ కేకును కట్ చేసి మొక్కలు నాటారు.

గళికలమందు తిని కూలీ ఆత్మహత్య

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: స్థానిక ఎడంవారిపల్లి దగ్గర ఇటుక బట్టీలో పనిచేస్తున్న కూలీ కుటుంబ కలహాలతో గుళికలమందు తిని ఆత్మహత్య చేసుకున్నట్టు భాకరాపేట ఎస్ఐ ప్రకాష్ కుమార్ తెలిపారు. ఎస్ఐ వివరాలమేరకు చిత్తూరుకు చెందిన సుబ్బరాజు (55) అతని భార్య వెంకటమ్మ ఇటుక బట్టీలో కూలిపని చేసుకొంటూ జీవనం చేసుకొంటున్నారు. ఈక్రమంలో తాగుడుకు బానిసైన సుబ్బరాజు ఇద్దరి కూలి డబ్బులు తాగుడుకే ఖర్చుచేస్తుండడంతో ఇద్దరిమధ్య గొడవలు జరిగేవి. రోజూ తాగి వెంకటమ్మను వేదించి కొట్టేవాడు. దెబ్బలు తాళలేక కొద్దిరోజులుగా ఆమె కనబడకుండా వెళ్ళిపోయి తిరిగి మళ్లీ మంగళవారం వచ్చింది. మళ్ళీ గొడవకు దిగికొట్టడంతో వెళ్ళిపోయింది. తాగిన మైకంలో గుళికలమందు తిని ఆత్మహత్యకు పాల్పడి అపస్మారక స్థితిలో వున్న సుబ్బరాజును తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు ఎంఎన్ ప్రసాద్ మృతి




తిరుపతి టౌన్ : సీనియర్ జర్నలిస్టు ఎంఎన్ ప్రసాద్ (57) బుధవారం మృతిచెందారు. ఎంఎన్ ప్రసాద్ (ఎం.నరసింహ ప్రసాద్) 1989లో ఆంధ్రజ్యోతిలో సబెడిటర్‌గా చేరారు. సాక్షిలోనూ సేవలందించారు. ఆంధ్రప్రభలోనూ డెస్క్ ఇన్‌ఛార్జిగా ఆరేళ్లు పనిచేశారు. ఏడాదిగా మనదేశం, స్కైలైన్ పత్రికల్లో పనిచేశారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లో అక్క దగ్గరే ఉన్నాడు. ఐదారేళ్లుగా రేణిగుంట కాటన్‌మిల్లు ఎదురుగా ఉన్న స్వంత ఇంటిలో ఒంటరిగా ఉంటూ తరచూ పరిచయస్తులతో మాట్లాడేవాడు. బుధవారం అతని ఇంటినుంచి దుర్వాసన వస్తుండడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా శ్రీకాళహస్తిలో ఉన్న అతని సోదరునికి తెలియజేసి మృతదేహాన్ని బయటకు తీసారు. ఇంటిలో మంచంపై దోమతెర మధ్యలో పడుకుని అలాగే మరణించాడని, మృతిచెంది రెండు రోజులు అయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అంత్యక్రియలు గురువారం జరపనున్నట్లు అతని సోదరుడు తెలియజేశాడు.

పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు..

వయోపరిమితి పెంచాలి: రెడ్డి శేఖర్ రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యర్థులకు వయోపరిమితిని పెంచాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరుమల శెట్టి రెడ్డి శేఖర్ రాయల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా మహమ్మారి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఉద్యోగ నియామకపు నోటిఫికేషన్లను విడుదల చేయలేదని, ఇప్పుడు విడుదల చేసిన పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో ఎంతోమంది నిరుద్యోగ అభ్యర్థులు వయో పరిమితిని పెంచాలని కోరుతున్నారన్నారు. జనాభాలో అత్యధికులుగా ఉన్న కాపులు, బలిజల సామాజిక వర్గానికి చెందిన వారు అర్హులుగా ఉండి నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వయోపరిమితిని పెంచి నిరుద్యోగులు ఉపాధి పొందే లాగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్పి గిరివెంకటరమణ, గుండాల వేణుగోపాల్ రాయల్, బెల్లంకొండ శ్రీనివాసులు రాయల్, ఇండ్ల నరసింహులు రాయల్, తిరుమల శెట్టి కిరణ్ కుమార్ రాయల్, కంచన కృష్ణమూర్తి రాయల్, మాచర్ల రఘు రాయల్, ఇండ్ల జగదీష్ రాయల్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు క్రైస్తవుల కృతజ్ఞతలు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఆంధ్రప్రదేశ్‌లోని పాస్టర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందించడం శుభపరిణామమని ఇందుకు రాష్ట్రంలోని క్రైస్తవులందరూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్ల కృతజ్ఞతతో ఉన్నారని ఆంధ్ర ప్రదేశ్ బిషప్ కౌన్సిల్ ఛైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా బాపట్ల జిల్లా చుండూరు హెలిప్యాడ్ వద్ద కలిసిన ప్రవీణ్ పుష్పగుచ్ఛాల అందించి సిఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బరియల్ గ్రౌండ్స్ కేటాయించాలని, ఒకవేళ ఉచితంగా ఇవ్వలేకపోయినా ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి ప్రభుత్వం దగ్గర అలినేషన్ ద్వారానైనా క్రైస్తవులకు భూమి కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నాగార్జున, అధ్యక్షులు దిశ బాలరాజు, ప్రధాన కార్యదర్శి వానలో డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి - క్యాంపస్ : దేశవ్యాప్తంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం జరుపుకుంటారు. ఈ సందర్భంగా బుధవారం జీవకోన విశ్వం హై స్కూల్ ఆట స్థలంలో దాదాపు 200 మంది విశ్వం విద్యార్థులు మ్యాథ్స్ డే, రామానుజన్ సంఖ్య 1729 ఆకారంలో వినూత్నంగా కూర్చొని మ్యాథ్స్ డేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ సంఖ్యాశాస్త్రంలో రామానుజన్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం రామానుజన్ జయంతిని జాతీయ గణితశాస్త్ర దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి మాట్లాడుతూ మానవ విజ్ఞానంలో అత్యంత ఉపయోగకరమైన, ఆసక్తి కరమైన శాస్త్రాల లో గణిత శాస్త్రం ఒకటి అని, ప్రతి ఒక్కరూ వారి దైనం దిన కార్యక్రమాలలో గణితం ఉపయోగిస్తారని తెలిపారు.

అవసరానికి మించి ఎరువులు వాడకూడదు



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: పంట సాగులో అవసరానికి మించి ఎరువులు, రసాయనిక మందులు వాడటం అంత మంచిది కాదని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. ఆత్మ పథకం కింద మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన రైతుల శిక్షణ కార్యక్రమంలో ఏడీఏ భాస్కరయ్య మాట్లాడుతూ వరి పంటలో అధికంగా వాడే రసాయనిక ఎరువులు యూరియా అధికంగా వాడటం వలన చీడపీడలు అధికంగా ఆశించే ప్రమాదం ఉందని తెలిపారు. మామిడి తోటలతో పాటు నేరేడు, డ్రాగన్ ఫుడ్ పంట తోటలను పరిశీలించి రైతులకు సూచనలు అందజేశారు. ఆర్.బి.కె సిబ్బంది భాను ప్రకాష్, జాహ్నవి, రాజశేఖర్, మునిశేఖర్, ఇలియాజ్, సాయి కృష్ణ, నలిని, తదితరులు పాల్గొన్నారు.

తుడా నిధులతో మెటల్ రోడ్డు పనులు



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని కూరపర్తి వారిపల్లి పంచాయతీలో కుమ్మరపల్లి, బోడేవాళ్ళపల్లి మెయిన్ రోడ్డు నుండి కూర పర్తివారిపల్లి మీదుగా ఆరేటమ్మ కుంట వద్ద గల నెరబైలు రోడ్డుకు అను సంధానంగా నిర్మించబోయే మెటల్ రోడ్డును వేయడానికి జెసిబి సాయంతో రోడ్డుకు ఇరువైపులా మరమ్మతులు ప్రారంభించినట్లు సర్పంచ్ జయమ్మ రమణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ రోడ్డు ప్రారంభోత్సవానికి డిఇ వెంకటేశ్వర ప్రసాద్, ఏఈ వంశీకృష్ణ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డుకు అవసరమైన కల్వర్టుల నిర్మాణ ఖర్చుతో సహా రూ.47 లక్షలు తుడా నిధులను ఈ మెటల్ రోడ్డు నిర్మాణానికి తుడా నుండి నిధులు కేటాయించినట్లు వారు తెలిపారు. రెండు నెలల కాల వ్యవధిలో ఈ రోడ్డును పూర్తి చేసి ప్రజల రవాణా సౌకర్యార్థం అందుబాటులోకి తెస్తామని వారు తెలిపారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం 73 ఏళ్లు నిండిన సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. స్థానిక చెంచులక్ష్మి కాలనీ సమీపంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో సీనియర్ పెన్షనర్లయిన 80 మందిని ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. సన్మాన గ్రహీతలు, సంఘ సభ్యులు హాజరయ్యారు.

ఎస్ఐకు సత్కారం

ప్రజాశక్తి -పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు రక్షణ నిలయంలో బుధవారం వైసీపీ కన్వీనర్ మారాబత్తిన సుధాకర్, పెన్నేపల్లి గ్రామ సర్పంచ్ చక్రపాణి, ఎస్ఐ సిహెచ్ కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలవేసి సత్కరించారు. అనంతరం మండల విషయాలు ఆయనతో చర్చించారు. వీరితోపాటు పలువురు వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రత్యేక ప్రతిభావంతులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రత్యేక ప్రతిభావంతులకు రూ.65 వేలు అలాగే రెడ్ సంస్థకు మరో రూ.50 వేలు నగదును స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పోణకా దేవసేనమ్మ, ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బల్లికళ్యాణ్ చక్రవర్తి తదితరుల చేతుల మీదుగా బుధవారం అందజేశారు. అనంతరం దుప్పట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మెరీగ మురళి శిశు సంక్షేమ శాఖ కో-ఆర్డినేటర్ కోడూరు కల్పలత, నాటకారంగా అకాడమీ డైరెక్టర్ యరంమంజుల, కమిషనర్ సాయినాథ్, నాయకులు బత్తిన విజయ్ కుమార్, మీరా రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, జెడ్పిటిసి సభ్యురాలు యామిని కోదండరామయ్య గోపాల్ యాదవ్, ముని సాయి అజీజ్ ఖాన్,హాషీమ్, అహ్మద్ భాషా జమీర్, వసీం సాబిల్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు కే. మురళి రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే రాజారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధిలో బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు తమ వంతు కృషి చేయడం సంతోషదాయకమన్నారు. ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని ఏపీ విశ్వవిద్యాలయాల భోదనేతర సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.మురళి రెడ్డి పేర్కొన్నారు.

మొక్కలు మానవునికి జీవనాధారం

- వీసీ ఆచార్య రాజారెడ్డి - పలుచోట్ల మొక్కలు నాటిన అధికారులు



ప్రజాశక్తి - క్యాంపస్: సువిశాలమైన భూ ప్రపంచంలో మొక్కలు మానవుని జీవనాధారమని, వృక్షాలను కాపాడటం మానవుని నైతిక బాధ్యత అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్క రించుకొని ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో, ఎస్వీయూలోని దేవాలయం చుట్టూ, పలుచోట్ల ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి, రెక్టార్ ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యా వ్యవస్థలో విద్యార్థులు భూగోళంలో పచ్చదనాన్ని పెంపొందించి పరిరక్షించడంలో గొప్ప పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా, జ్ఞానప్రద వేంకటేశ్వర స్వామి గుడి పక్క అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య పద్మనాభం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, సైన్స్, ఆర్ట్స్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలల సేవా వాలంటీర్లు, పాలకమండలి సభ్యులు మధు, పరమగీతం, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపకులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినూత్న రూపకల్పనలకు రూపమివ్వాలి


నైపర్ మాజీ డైరెక్టర్ ఆచార్య రఘురామారావు



ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థినులు తమ వినూత్న ఆలోచనలు రూప కల్పనలకు రూపం ఇచ్చే విధంగా ప్రయోగాలను ఇంకుబేషన్ సెంటర్లను విని యోగించుకోవాలని మొహలీలోని నైపర్ మాజీ డైరెక్టర్ ఆచార్య రఘురామారావు పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ బుధవారం అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉపన్యాసంలో ముఖ్య అతిథిగా మొహాలీ నైపర్ మాజీ డైరెక్టర్ ఆచార్య ఏ.రఘురామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన "పీర్ పర్సెప్షన్" అనే అంశంపై ప్రసంగించారు. విద్యార్థినిలు ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులుగా అవ్వడానికి కృషి చేయాలన్నారు. సోషల్ మీడియా ఎలా మన జీవితాలలో భాగమయ్యాయో తెలుపుతూ వాటి ద్వారా వారు ఉపాధి అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలో వివరించారు. ఆలోచనల గురించి కలలు కనడమే కాక, ఆ అలోచనలు కార్యరూపం దాల్చడానికి, మహిళా విశ్వవిద్యాలయంలో ఉన్న ఇంక్యూబేషన్ సెంటర్స్ ఎలా ఉపయోగపడుతాయో కూడా పరిశీలించుకోవాలన్నారు. ఈ సదస్సు హెడ్ అఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ ఆచార్య. బి. శైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఇతర ఆచార్యులు, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు అక్రమాలను పరిశీలించండి

తహశీల్దార్‌కి సిపిఎం, సిపిఐ వినతి



తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు నమోదు అక్రమాలు జరిగాయి పరిశీలన చేసి సరి చూడాలని. పుత్తూరు సిపిఎం నగరి నియోజకవర్గ కార్యదర్శి ఆర్ వెంకటేష్. వై.నందయ్య. సిపిఐ పట్టణ కార్యదర్శి మహేష్ పుత్తూరు ఇన్చార్జి తహశీల్దార్ రవికుమార్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికలో బోగస్ ఓట్లు నమోదైనట్లు ఎన్నికల కమిషనర్‌కు తెలిపారు. ఎన్నికల కమిషనర్ నుండి పై సూచకలోని ఉత్తర్వులు ప్రైవేటు పాఠశాల నుండి వచ్చిన అప్లికేషన్లను పరిశీలించాలని ఆదేశించారు. పిఎఫ్/ఈపీఎఫ్ లేదా బ్యాంకు ద్వారా చెల్లించే జీతాలు వివరాలు పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చున్నారని, తమ పరిధిలో వచ్చిన ప్రైవేటు విద్యాసంస్థల నుండి నమోదైన అప్లికేషన్లను ఉత్తర్వులలో ఉన్న ఆదేశాల ప్రకారం పిఎఫ్/ఈపీఎఫ్ లేదా బ్యాంకు ద్వారా లేదా చెల్లించిన జీతాలు వివరాలను పరిశీలించి తగిన అప్లికేషన్లను తగు నిర్ణయాలను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో బసాయపాలెం

బొజ్జల సుధీర్ రెడ్డి



ప్రజాశక్తి -తొట్టంబేడు: బసవయ్యపాలెం గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం అయినాబ సవయ్యపాలెం పంచాయతీలో ఇదేం ఖర్మ కార్య క్రమంలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు గత తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నారా చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రిగా, దివంగత నేత మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, పోతుగుంట గురవయ్య నాయుడుల సహ కారంతో గ్రామంలో ఎస్సీ కాలనీలకు పక్కా గృహాలు, సిమెంట్ రోడ్లు, వీధి లైట్లు, స్కూలు బిల్డింగులు తప్ప గత ఈ మూడు సంవత్స రాలలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని బొజ్జల సుధీర్ రెడ్డి వద్ద ఇదేం ఖర్మ మా పంచాయితీకని, పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్నా అభివృద్ధి జాడేలేదని విన్నవించారు. ఒక్క ఛాన్స్ అన్న పేరుతో తాము తప్పు చేశామని రాబోయే ఎన్నికల్లో ఈ తప్పును సరిదిద్దుకొని గోపాల కృష్ణారెడ్డి వారసత్వానికి తమ పంచాయితీ సత్తా ఏమిటో చూపిస్తామని తెలియజేస్తూ, గ్రామ కమిటీ అధ్యక్షులు నియోజకవర్గం అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది కమల్ కుమార్ ఆధ్వర్యంలో సుధీర్ రెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.



రాష్ట్ర టీటీ పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్(శ్రీరామ్ నగర్ కాలనీ) విద్యార్థులు రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-16 టేబుల్ టెన్నిస్ బాలురు, బాలికల విభాగంలో శ్రీ చైతన్య విద్యార్థులు పోటీపడ్డారు. ఈ పోటీల్లో చారిత, నిత్య హాసిని, కుశ్యంత్ వర్మ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, ఏజీఎం శ్రీనివాసులు, పిఈటి మేఘన తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ప్రజాశక్తి -బాలాయపల్లి : ఏసు నామమే మనకు రక్షణ మార్గమని జీసస్ లవ్ మినిస్ట్రీ అధినేత బత్తల సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు రూరల్ మండలం గొల్లపల్లి గ్రామంలో ఉన్న వెందోటి సౌజన్య రెడ్డి స్కూల్ ప్రాంగణంలో జీసస్ లవ్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. అనంతరం క్రిస్మస్ తాత వేషధారణలో నాట్య ప్రదర్శనలు చేశారు. ఈకార్యక్రమంలో జీసస్ లవ్ మినిస్ట్రీ పాస్టర్లు గౌరదేవి ప్రదీప్,రవి పాస్టర్. పౌలు పాస్టర్ సీమోను పాస్టర్, ఏసుదాసు పాస్టర్, పాస్టరమ్మ కృష్ణవేణి, వెందోటి సౌజన్య రెడ్డి స్కూల్ డైరెక్టర్ దానం.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామం వద్ద ఎన్‌హెచ్ 71 జాతీయ రహదారిపై బుధవారం పెళ్లకూరు మండలం సబ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ కృష్ణారెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించని, పత్రాలు సరిగా లేని ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు అపరాధ రుసుము విధించారు. అనంతరం వాహనదారులకు రోడ్డు భద్రత, ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఆయన సూచించారు.